క్లుప్తంగా

పప్పు దినుసులతో అంబేడ్కర్ చిత్రం



దుబ్బాక : గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని దుబ్బాకకు చెందిన ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడు బదనకంటి అనిల్ కుమార్ అంబేడ్కర్ చిత్రాన్ని పప్పు దినుసులతో వేశాడు. ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంది. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన సందర్భంగా అంబేడ్కర్ చిత్రం వేసినట్లు చెప్పాడు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి

ఎంపీపీ మాణిక్యరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ మాణిక్యరెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఎంపీపీ మాణిక్యరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచి, 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను సరఫరా చేయాలన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో రైతులకు ఎలాంటి కష్టాలు రాలేదన్నారు. యాసంగి పంటకు సకాలంలో నీరు విడుదల చేసిన మంత్రి కొండా సురేఖకు రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు పాపయ్య, ఏఎంసీ చైర్మన్ కొండం వనిత, సొసైటీ చైర్మన్ కనకరాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్ ఉమేష్ చంద్ర, ఎంపీటీసీ శారద పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



ప్రభాకర్

దుబ్బాకటౌన్: తన భర్త కనిపించడంలేదని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. శుక్రవారం ఎస్‌ఐ గంగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటకు చెందిన గాజుల ప్రభాకర్(42) వృత్తిరీత్యా డ్రైవర్. అతడి మానసిక పరిస్థితి సరిగా ఉండదని, ఫోన్ స్విచ్ ఆఫ్ ఉండటంతో వారం రోజులుగా కుటుంబ సభ్యులు తెలిసినవారిని విచారించినా అతడి ఆచూకీ లభించలేదు. ప్రభాకర్ భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


యువత క్రీడాల్లో రాణించాలి



బహుమతులు అందుకుంటున్న క్రీడాకారులు

మిరుదొడ్డి(దుబ్బాక): యువత క్రీడల్లో రాణించాలని మిరుదొడ్డి ఎస్‌ఐ నరేష్ అన్నారు. మండల పరిధిలోని అల్వాలలో ప్రముఖ సామాజిక నాయకుడు గుర్రప్పగారి శేషు సహకారంతో గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం గ్రామస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి సాధించిన మతిన్ టీంకు జ్ఞాపిక, రూ.3 వేల నగదు, రెండవ బహుమతి పొందిన యాసిన్ టీంకు జ్ఞాపిక, రూ.2 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎనగంటి కిష్టయ్య, ఉప సర్పంచ్ దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏటా గ్రామంలో క్రికెట్ పోటీలు



ఎల్లారెడ్డిపేటలో మాట్లాడుతన్న ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పోచయ్య

తొగుట(దుబ్బాక): యువకులు క్రీడల్లో సత్తాచాటాలని ఏటా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తొగుట ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ దేవునూరి పోచయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎల్లారెడ్డిపేటలో క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏటా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామీణ యువకులు జిల్లాస్థాయికి ఎదగాలన్నారు. సాయంత్రం పోటీలు ముగిసిన వెంటనే విజేతలకు నగదు బహుమతి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

31 వరకే సీసీఐ పత్తి కొనుగోళ్లు

బెజ్జంకి(సిద్దిపేట): ఈనెల 31వ తేదీ వరకే బెజ్జంకి మండలంలో సీసీఐ పత్తి కొనుగోళ్లు చేస్తారని బెజ్జంకి ఏఎంసీ చైర్మన్ చంద్రకళ శుక్రవారం తెలిపారు. పత్తి రైతులు సకాలంలో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని పేర్కొన్నారు.

మదినిండా.. జాతీయ జెండా

- నియోజకవర్గాల్లో గణతంత్ర వేడుకలు
- జెండాను ఎగురవేసిన నాయకులు, అధికారులు
- నందడిగా మారిన పల్లెలు, పట్టణాలు

గణతంత్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థలు, దేవాలయాలు త్రివర్ణ పతాకాలతో రెపరెపలాడాయి. జాతీయ పతాకావిష్కరణలు, గీతాలాపనలతో ఊరూరా జెండా పండుగ వేడుకలు అలరించాయి. విద్యార్థినులు దేశభక్తి ఉట్టిపడేలా పిరమిడ్ విన్యాసాలు, త్రివర్ణ పతాక వందనం తదితర ప్రదర్శనలతో అలరించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. విద్యార్థుల జాతీయ నాయకుల వేషధారణలు, ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి.



వర్గల్‌లో త్రివర్ణ పతాకంతో కేజీబీవీ విద్యార్థుల పిరమిడ్ విన్యాసం



దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత



హుస్నాబాద్‌లో జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఆర్డీఓ బెన్ షాలెమ్



చేర్యాల మున్సిపల్ కార్యాలయం ఎదుట జెండాకు వందనం కమిషనర్ రాజేంద్రకుమార్



గజ్వేల్‌లోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద జాతీయ పతాకానికి వందనం చేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు



ములుగు(గజ్వేల్): బస్వాపూర్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ జయమ్మ



తిమ్మాయిపల్లి ప్రభుత్వ పాఠశాలలో జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం



సిద్దిపేట జెడ్పీ కార్యాలయంలో గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నమస్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజా



సిద్దిపేటలో ఆర్యవైశ్య, వనిత క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మహిళలు



చిన్నకోడూరు (సిద్దిపేట): చిన్నకోడూరు తహసీల్దార్ కార్యాలయంలో ..

అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతా

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



మిరుదొడ్డి(దుబ్బాక): అల్మాజీపూర్‌లో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): అభివృద్ధిలో నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దుతానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని అల్మాజీపూర్‌లో శుక్రవారం గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు కృషి చేస్తానన్నారు. గ్రామీణ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారం కోసం పాటు పడతానన్నారు. కొందరు నాయకులు తమ ఉనికి కోసం విమర్శలకు పాకులాడకుండా నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నియోజకవర్గ ప్రజలకు అందేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జెడ్పీటీసీ సూకూరి లక్ష్మీలింగం, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు చాట్ల పల్లి బాలమల్లేశం గౌడ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు వంగ మంజుల, పన్యాల వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పంజాల శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు రవి పాల్గొన్నారు.

దుబ్బాక రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తా

దుబ్బాకటౌన్: దుబ్బాక రెవెన్యూ డివిజన్‌తో పాటు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా దుబ్బాక క్యాంపు కార్యాలయం, గాంధీ విగ్రహం వద్ద జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత, ఎంపీపీ కొత్త పుష్పలత, జెడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సబ్బండ వర్గాలకు న్యాయం

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనాన్ని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ పాలనలోనే సబ్బండ వర్గాలకు న్యాయం జరిగిందన్నారు. దళితులకు దళిత బంధు, బీసీలకు బీసీ బంధు, మత్స్యకారులకు చేపలు, గొల్లకురుమలకు గొర్రెలు ఇచ్చిన ఘతన బీఆర్‌ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. అనంతరం శ్రీకూడవెల్లి రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. రాబోయే మాఘఅమావాస్య జాతర ఉత్సవాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆయల సిబ్బందిని ఆదేశించారు. నీట గుండం వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ చైర్మన్ బక్కి వెంటకయ్య, సర్పంచ్ సుగుణ, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కైలాష్, మండల పార్టీ అధ్యక్షుడు జీడిపల్లి రవి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

30లోగా పంచాయతీ భవనాలను ప్రారంభించాలి

మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్: ఈనెల 30వ తేదీలోగా కొత్తగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాల మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించాలని లేకుంటే బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులే ఆ భవనాలను ప్రారంభించేందుకే వెనుకాడబోరని మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ హెచ్చరించారు. పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. తాను వచ్చే వరకు ప్రభుత్వ కార్యక్రమాలు చేపట్టవద్దని చెప్పడం ఏ రాజ్యాంగంలో రాసిఉందో చెప్పాలని డిమాండ్ చేశారు. కరీంనగర్, హుజూరాబాద్ నియోజకవర్గాల్లో ప్రభుత్వ కార్యక్రమాలను తాను వచ్చే వరకు కార్యక్రమాలు చేయకూడదని అక్కడి ఎమ్మెల్యేలను మంత్రి అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఆయన కేవలం హైదరాబాద్‌కు మాత్రమే ఇన్‌చార్జి మంత్రి అని తెలుసుకోవాలన్నారు. కరీంనగర్, సిద్దిపేట, హన్మకొండ జిల్లాలకు కూడా తానే ఇన్‌చార్జి అంటే అందుకు అనుగుణంగా నడుచుకుంటామన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ రజిత, వైస్ చైర్ పర్సన్ అనిత, మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, ఎంపీపీలు లకావత్ మానస, మాలోతు లక్ష్మి, జెడ్పీటీసీ భూక్యా మంగ, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాష తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు పిల్లిని అహరించారు

బాధితుడి ఫిర్యాదు

సిద్దిపేటజోన్: తన పెంపుడు పిల్లిని అపహరించారని బాధితుడు శుక్రవారం రాత్రి జిల్లా పోలీసు కమిషనర్, కలెక్టర్‌కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశాడు. సిద్దిపేట పట్టణంలోని భారత్ నగర్‌కు చెందిన జ్ఞానసాగర్‌కు చెందిన పెంపుడు పిల్లి.. ఈనెల 19వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీంతో బాధితుడు శుక్రవారం కలెక్టర్, పోలీస్ కమిషనర్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశాడు. గతంలో కూడా తన పిల్లిని ఎత్తుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

పార్టీ కార్యాలయాన్ని శుద్ధి చేసిన శ్రేణులు



పార్టీ కార్యాలయాన్ని శుద్ధిచేస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో చక్రధర్ గౌడ్ పాల్గొనడంతో కార్యాలయాన్ని ఆ పార్టీ నాయకులు శుద్ధి చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో అనేక కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్న చక్రధర్ గౌడ్ పాల్గొనడం సరికాదన్నారు. కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకులతో పార్టీ కార్యాలయాన్ని శుభ్రం చేశామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ రాష్ట్ర వైస్ చైర్మన్ కలీముద్దీన్, మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అర్షద్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు వహబ్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

సిద్దిపేట: సిద్దిపేట జిల్లా కేంద్రంలో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సెలెస్టియల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలు ఇజ్‌నహ మెహ్రీన్, ఇఫ్రాహ్ మెహ్రీన్‌కు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ హన్మంతా రెడ్డి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతులు పొందిన విద్యార్థినులు



బహుమతులు పొందిన విద్యార్థినులతో టీచర్లు

విద్యార్థులు కష్టపడి చదవాలి



విద్యార్థులకు డిక్షనరీలను అందజేస్తున్న సర్పంచ్ రజిత

మద్దూరు(హుస్నాబాద్): సమాజంలో ఉన్నత స్థానం సంపాదించాలంటే విద్యార్థి దశ నుంచే కష్టపడి చదవాలని సర్పంచ్ ఆలేటి రజిత అన్నారు. శుక్రవారం మండలంలోని వల్లంపట్ల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు డిక్షనరీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉన్న వారందరు బాగా చదువుకోవడంవల్లే ఆ స్థాయికి చేరారన్నారు. డిక్షనరీలను అందజేసిన ఆలేటి రవిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి: ఎస్‌ఐ దామోదర్



వాహనదారులకు పూలు అందిస్తున్న ఎస్‌ఐ

చేర్యాల(సిద్దిపేట): వాహనదారులు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ దామోదర్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణ శివారులో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు వివరించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారికి గులాబీ పూలు అందించి అవగాహన కల్పించారు.

సామాజిక సేవలతోనే గుర్తింపు

ఎంపీపీ గజ్జెల సాయిలు



మాట్లాడుతున్న ఎంపీపీ సాయిలు

మిరుదొడ్డి(దుబ్బాక): సామాజిక సేవలతోనే మంచి గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ గజ్జెల సాయిలు, వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు అన్నారు. అనంతరెడ్డి మెమోరియల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ మాధవరెడ్డి సౌజన్యంతో మండల పరిధిలోని అల్వాల ప్రాథమిక పాఠశాలను దత్తత తీసుకుని సుమారు రూ.7.50 లక్షల విలువైన వాటర్ ప్లాంట్, సీసీ కెమెరాలు, బెంచీలు, చిల్డ్రన్స్ ఓపెన్ గేమ్స్ మెటీరియల్, జీరాక్స్ మిషన్, నోటు బుక్స్, క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ట్రస్ట్ చైర్మన్ మాధవరెడ్డి మాట్లాడుతూ దత్తత తీసుకున్న పాఠశాల విద్యార్థులకు ప్రతీరోజు పౌష్టికాహారం అందించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ అహ్మద్, సర్పంచ్ ఎనగంటి కిష్టయ్య, ఉప సర్పంచ్ దిలీప్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలసాహిత్య పురస్కారాల ప్రదానం



పురస్కారాలు అందుకుంటున్న వరుకోలు లక్ష్మయ్య, బెజుగామ శ్రీజ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): డాక్టర్ చింతోజు బ్రహ్మయ్య మెమోరియల్ ట్రస్టు బాలసాహిత్య పురస్కారాలు జిల్లాకు చెందిన వరుకోలు లక్ష్మయ్య, బెజుగామ శ్రీజ శుక్రవారం అందుకున్నారు. వరుకోలు లక్ష్మయ్య రచించిన 'గుర్రాలగొంది మువ్వలు', బెజుగామ శ్రీజ రచించిన 'శ్రీజ పద్య లహరి' పద్య సంపుటి పుస్తకాలకు ఈ పురస్కారాలు వరించాయి. కార్యక్రమంలో జాతీయ సాహిత్య పరిషత్ సిద్దిపేట అధ్యక్షుడు ఎన్నవెళ్లి రాజమౌళి, ప్రధాన కార్యదర్శి ఉండ్రాల రాజేశం, శ్రీవాణి సాహిత్య పరిషత్ అధ్యక్షుడు పెందోట వెంకటేశ్వర్లు, బస్వ రాజ్ కుమార్, కథాశిల్పి ఐతాచంద్రయ్య, గరిపెల్లి అశోక్, ఎడ్ల లక్ష్మి, సుధాకర్, కోణం పర్శ రాములు తదితరులు పాల్గొన్నారు.